

శ్రీభాష్యం రాజేశ్వరరావు

'మూన్ రాక్ ఎగ్జిబిషన్!'

'చంద్రశిల ప్రదర్శన'

తెల్లని గుడ్డ మీద వ్రాసిన అక్షరాలు మెరిసి పోతున్నాయి;

ఆవరణ నిండా తోరణాలు! హాలు నిండా తోరణాలు! రంగు రంగుల కాగితాల తోరణాలు! గాలికి టప-టపమని కొట్టుకుంటూ ఆనందంతో తలలూపు తున్నాయి.

విశాలమయిన ఆవరణ, వింతకాంతిని విరజిమ్ముతున్న లోపలి హాలు!

ఆవరణకు ముందు అందమైన గేటు ఠీవిగా, హుందాగా వుంది.

ఆవరణ చుట్టూ గోడ! గోడ నానుకుని రంగు రంగుల క్రోటన్ మొక్కలు.

ఆవరణ నిండా కార్లు! ఎండలో తళ తళ మెరుస్తున్నా: మిల మిల్లాడు తున్నాయి!

గేటు నుండి వరండా వరకూ పెద క్యూ!

వరండా దాటి హాలులోకి వెళ్ళటానికి మరింత పెద్ద క్యూ!

సుమారు ఫర్లాంగు పొడుగున పాములా మెలికలు తిరిగిన క్యూ!

పుట్టలోకి వెళ్తున్నట్టు హాలులోకి పాకు తోంది 'క్యూ'!

'క్యూ' నిండా టెర్లిన్ చొక్కాలు, రెయాన్ పేంట్లు, రంగు రంగుల చీరలు, గాజుల గల-గలలు, ఖరీదైన సెంటు వాసనలు, అత్తరుల పరిమళాలు, ఎండను భరించలేని సుందరాంగుల నిట్టూర్పులు!

చేంతాడు లాటి 'క్యూ'. మెత్తగా నత్తగుల్లలా ముందుకు కదుల్తోంది!

సంఘంలో ముందుకు వెళ్ళటం కష్టం! 'క్యూ'లో ముందుకు వెళ్ళటం మరింత కష్టం;

'క్యూ' కదుల్తోంది; మెల్లగా, హోదాగా, నిండుగా!

ముందు జనంతోబాటు నేనూ కదుల్తున్నాను. చంద్రశిలను దర్శించాలనే కుతూహలం చంపుకోలేక ఆఫీసుకు శెలవుపెట్టి మరీ వచ్చాను. పొడుగాటి 'క్యూ' చూస్తే నిరుత్సాహం, విసుగు కల్గిన మాట వాస్తవం. కానీ చంద్రశిలను చూడాలనే ఆసక్తి వాటిని జయించింది!

'క్యూ' ముందుకు కదుల్తోంది!

పైన ఎండ మండుతోంది!

బీచ్ మీదనుంచి వస్తున్న చల్లనిగాలి శరీరానికి తాకి కాస్త ఉపశమనాన్ని కలుగజేస్తోంది.

కారు హారన్లు, లోపల మైకులోనుండి వినవస్తున్న ఇంగ్లీషు మాటలు, 'క్యూ'లో జనం మాటలు; అంతా - సందడిగా వుంది!

''అసలు, యీ చంద్రశిల ఎలా వుంటుందంటారు!''

నా ముందు నిలబడిన బట్టతలాయన ఆయన ముందున్న గిరజాల పెద్దమనిషిని అడుగుతున్నాడు.

గిరజాల పెద్దమనిషి వెనక్కు తిరిగి వేదాంతిలా నవ్వేడు. 'పాలిష్' మండి వచ్చిన పెద్దమనిషి ఆదిమానవుడి వేపు చూసినట్టు బట్టతలాయన వేపు చూసేడు.

తరువాత ముఖం మీద పడుతున్న గిరజాలు వెనక్కు నెట్టుకుంటూ అన్నారు. "మన రోడ్డు ప్రక్కన వుండే కంకర రాయిలాగే వుందట! విన్న మా అల్లుడు చూశాడు. మా అల్లుడు 'జియాలజీ డిపార్టుమెంటు'లో పని చేస్తున్నాడు లెండి...."

"అంతేనా! ఇంకా మెరిసిపోతూ వుంటుందనుకున్నాను!" అంటూ తన ఆస్తి అంతా పోయినట్టు మొహం పెట్టి నిరుత్సాహపడి పోయాడు బట్టతలాయన!

'చంద్రశిలను పట్టుకొచ్చి యీ బట్టతల మధ్యలో పెడితే ఎటువైపు దొర్లుతుందా?' అని ఆలోచిస్తున్నాను నేను!

"దాని మీద చిన్న-చిన్న రంధ్రాలు కూడా వున్నాయట! ఆ శిల నిండా కార్బన్ ఎక్కువగా వుంటుందని మా అల్లుడు చెప్పాడు...."

గిరజాలాయన యింకా ఏదో చెప్పుకు పోతున్నాడు. వాళ్ళ అల్లుడే చంద్రశిలకు 'ఆథారిటీ' అయినట్లు అభివర్ణిస్తున్నాడు.

నా ముందున్నాయన ఎండక మాడిపోతున్న బట్టతలను రెండు చేతులతో నిమురుకుంటూ చిరాకుగా ముఖం పెట్టి వింటున్నాడు.

'క్యూ' ముందుకు కదుల్తోంది.

ముందుకు కదిలి మెల్లగా వరండా మెట్లు ఎక్కాను!

'కాంప్లిమెంటరీ'లతో వచ్చిన వాళ్ళు 'క్యూ'ని దాటుకొని విడిది ఇంట్లోకి వెళ్తున్న మగపెళ్ళివారికి మల్లే పందాగా దర్జాగా లోపలికి దూరి పోతున్నారు.

వరండాలోకి వెళ్ళగానే ప్రాణం లేచి వచ్చినట్లయింది!

చల్లని నీడలో సముద్రపు గాలి తగిలి కాస్త హాయిగా వుంది!

బట్టతలాయన చికాకు తగ్గి ముఖం కాస్త వికసించింది!

గిరజాలాయన రుమాలుతో ముఖం ఒత్తుకుంటున్నాడు.

ప్రతి నిమిషం గిరజాలను చెవులా వెనక్కి తోసుకుంటున్నాడు.

వరండాలో ఒక వారగా నిలబడి ఇద్దరు పోలీసులు బీడీలు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ప్రజల క్రమశిక్షణ మీద వాళ్ళకు దారుణమైన నమ్మకం వుంది కాబోలు, అసలు 'క్యూ' దగ్గరకు రాకుండా దూరంగానే వుండిపోయారు.

'క్యూ' మరి కాస్త ముందుకు కదిలింది.

వరండా దాటి హాలులోనికి అడుగు పెట్టాను!

హాలులోని 'ట్యూబ్ లైట్లు' తెల్లని కాంతిని విరజిమ్ముతున్నాయి!

హాలు గోడలు పాలలో ముంచి తీసినట్లు తెల్లగా మెరుస్తున్నాయి. అతి చల్లగా, హాయిగా వుంది లోపల!

పంకాలు కూడా శబ్దం చేయటం యిష్టం లేక కాబోలు మెల్లిగా తిరుగుతున్నాయి.

గోడకు రంగు రంగులలో అంతరిక్ష నౌకల చిత్రాలు అమర్చబడ్డాయి.

తెల్లని దీపాల కాంతి ముందు గాజు పలక మీద వ్యోమగాముల చిత్రాలు మెరిసిపోతున్నాయి.

మైకులో అందమయిన ఆడ కంఠం ఆంగ్లంలో అంతరిక్ష యాత్రా విశేషాలను అభివర్ణిస్తోంది.

యాత్రకు అయిన ఖర్చుల వివరాలు. వ్యోమగాములు పడిన శ్రమ అన్నీ విడమర్చి చెప్తోంది!

నా ముందున్న బట్టతలాయన నా వైపుకు తిరిగి "అమ్మో! అన్ని కోట్ల డాలర్లే!.... అంత డబ్బు వుంటే ఇండియాలో కొన్ని లక్షల బిల్డింగ్స్ కట్టెయ్యొచ్చు!.... ఏమంటారు?" అన్నాడు.

"ఔను.... కొన్ని కోట్ల కిళ్ళీ బడ్డీలు కూడా పెట్టుకోవచ్చు!" అందామనుకున్నాను. కాని బాగుండదని చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను. బట్టతలాయనకు నా చిరునవ్వు రుచించలేదు కాబోలు ముఖం చిట్లించుకొని ముందుకు తిరిగి పోయాడు. మెల్లగా ఏదో సణుక్కుంటూ వేళ్ళు మడిచి లెఖ్ఖలు కడుతున్నాడు!

బహుశః ఎన్ని బిల్డింగ్స్ కట్టొచ్చునో లెఖ్ఖేస్తున్నాడు కాబోలు!

"మీరు బిల్డింగ్స్ కంట్రాక్టరా?.... మిమ్మల్ని యింతకు ముందు ఎక్కడో చూసినట్టుంది!" అన్నాను.

"కాదండీ! లారీల కంట్రాక్టర్ని... అక్కయ్య పాలెం 'క్వారీ' నుంచి 'పిక్క' తోల్తున్నాయి మా లారీలు! నాకు అయిదు లారీలున్నాయి! రెండు లేలెండులు, మూడు బెంజిలు.... నేనప్పుడే పదేళ్ళుగా యీ వూళ్ళోనే వుంటున్నాను లెండి...." యింకా ఏదో చెప్తున్నాడాయన.

ఆయన మాటలు వింటూనే ప్రక్కనున్న 'ఈగిల్' నమూనాను తిలకిస్తున్నాను. చంద్రుని ఉపరితలం మీద దిగటానికి అనువుగా అది ఎలా తయారు చేయబడిందో, దాని నిర్మాణంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నారో; అవన్నీ విడమర్చి చెప్తున్నాడు అక్కడ నిలబడ్డ గైడ్?

ఇంకాస్త ముందుకు వెళ్తే వ్యోమ

నౌకల అనుసంధానాన్ని చూపించే చిత్రం వుంది. దాన్ని దాటి వెళ్తే ఎదురుగానే వుంది చంద్రశిల.

తెల్లని 'నైట్రోజన్ జార్'లో శ్రద్ధ పరిచారు దాన్ని. మూడు 'స్టీలు లెగ్స్' మీద అతి పొందికగా వుంది. బాదంకాయ కంటె కొంత పెద్ద పరిమాణంలో నలుపు రంగుతో చిన్న-చిన్న కన్నాలతో; చూడ టానికి మాత్రం కొంత పేలవంగానే వుంది. అన్ని వైపులా కనబడేలా 'నైట్రోజన్ జార్' మెల్లిగా తిరుగుతోంది.

కొద్ది క్షణాల పాటు దాని వంకే కన్నార్పకుండా చూస్తూ వుండిపోయాను. అది కేవలం శిలే కావొచ్చు. కాని అది అలా తిరుగుతూ వుంటే దాని వెనుక కొన్ని వేల మేధావుల ప్రజ్ఞ, శ్రమ కనిపించింది. మానవుడు భూమి మీద పుట్టాక సాధించిన అతి మహత్తర కార్యాల్లో యిదొకటి. సందేహం లేదు.

విశ్వమానవ కళ్యాణానికీ, సిరి సంపదలకూ చంద్రలోక యాత్ర ఏ విధంగా ఉపకరిస్తుందో యోచిస్తూ రాబోయే సత్ఫలితాలను ఊహిస్తూ హాలు దాటి బయటకు వచ్చాను.

నా ముందున్న బస్ర్తతలా యనకు పూర్తిగా ఉత్సాహం చచ్చిపోయినట్లుంది. "ఓస్. ఇలా వుంటుందంటే రాకనే పోదును. రిక్షాకు రెండు రూపాయలు దండుగ." అంటూ సణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

ఆవరణ దాటి జనాన్ని తప్పించుకుంటూ రోడ్డు మీదకు వచ్చాను. వచ్చే పోయే వాహనాలతో, మనుష్యులతో చాలా సందడిగా వుంది రోడ్డు. ఒక వారగా వెళ్ళి జనసమ్మర్దం అట్టే లేనిచోట నిలబడి జేబులోంచి సిగరెట్టు తీసి ముట్టించాను. నా మిత్రుడు భాస్కరరావు పన్నెండు గంటలకు యిక్కడకు వస్తానని చెప్పేడు. ఇద్దరం కలిసి యింకో ఫ్రెండు యింటికి వెళ్ళాలని అనుకున్నాం. సిగరెట్టు కాలుస్తూ అతని కోసం చూస్తూ నిలబడ్డాను.

"బాబూ. రెండు రోజులబట్టి గుక్కెడు గంజయినా లేదు. అయిదు పైసలుంటే ధర్మం చెయ్యండి...."

ప్రక్కకు తిరిగి చూశాను.

ఎవరో ముసిలిది. దాని వయసు ఏడు పదులకు పైబడి వుంటుందని ముడతలు పడ్డ దాని ముఖమే చెప్తోంది. జుట్టు పీకి పారేసిన తాటి టెంకకి మల్లే అతి అసహ్యంగా వుంది. తెల్లని కళ్ళు రెండూ లోతుకుపోయి చూడటానికి భయం కలిగిస్తున్నాయి. ఎండిపోయిన దాని గుండెలు చూస్తే; అసలు ఆమె పుట్టాక యవ్వనం చూడకుండా వృద్ధాప్యంలో అడుగు పెట్టినట్లుంది. దాని చేతులోని ఖాళీ రేకు డబ్బా వణవణా వణుకుతోంది. రెండో చేతిలోని కర్రమీదే ఆధారపడి నిలబడింది ఆమె.

"బాబూ. అయిదు పైసాలు ధర్మం చెయ్యండి మా రాజులూ...." ముసిల్ది సణుగుతున్నట్లు మెల్లిగా అడుగుతోంది.

మాట్లాడుతూ వుంటే ముడతలు పడిన చర్మం దవడలు ముద్దల్లా లోపలికీ పైకీ కదలుతున్నాయి. ఆ గొంతులోని దైన్యం, ఆ ముఖంలోని నైరాశ్యం చూసి, భరించలేక జేబులోంచి అయిదు పైసలు తీసి ముసిల్దాని డబ్బాలో పడేశాను.

"నూరేళ్ల బ్రతుకు బాబూ." అంటూ వణుకుతూ దీవించింది.

అయిదు పైసలకూ నూరేళ్ల చొప్పున నా జేబులోని చిల్లరంతా దానం చేస్తే ఎన్ని వందల యేళ్ళ ఆయుష్షు కలిపి వస్తుందో లెఖ్ఖలు కడుతూ నిలబడ్డాను.

"అయితే బాబూ. ఇదంతా ఏటి.... ఇయాళ యిక్కడికి యింత మందొచ్చారు."

ప్రక్కకు చూశాను. ఇంకా ముసిల్ది అక్కడే వుంది. తన ప్రశ్నకు సమాధానం కోసం నా వంక చూస్తోంది.

"అమెరికా వాళ్ళు చంద్రుని మీదకు వెళ్ళి, అక్కడి నుండీ రాళ్ళు, మట్టి పట్టుకొచ్చారు, అందులో ఒక రాతిని యిక్కడ చూపిస్తున్నారు." అన్నాను.

"ఏటి. ఆకాశం మీది సెంద్రుడిలోంచే...."

"కాదు. భూమ్మీద చంద్రుడిలోంచి." కసురుకున్నాను.

"ఏటి బాబూ. నేను ముసిల్దాన్నని ఏళాకోళం చేస్తున్నావేటి. నేక పోతే సెంద్రుడిలోంచి రాళ్ళు వస్తాడవేటి. అక్కడ మడుసులు ఎళ్ళడవేటి."

---

☼ రాధ జేవురించిన కళ్ళతో పార్కులో రాజు చేరువలో కూర్చుని "ప్రియా. చూసారా. ఆ రవి నన్ను కూడా వెంబడించి ఏదేదో అంటున్నాడు. మీ మిత్రుడని వూరుకుంటే మరీ మితిమీరి పోతున్నాడు."

"మరోలా భావించకు రాధా. రవికి యీ లోగడలో మతి పోయింది...." అన్నాడు రాజు.

"అయ్యో, పాపం." అంది రాధ.

"అలా వున్నా బాగుండిపోను. డాక్టరుగారు కొత్త ప్రయోగం చేద్దామని కుక్క మెదడు అమర్చారు. అప్పటినుంచీ యిలా తయారయ్యాడు.

—భూపతి సూర్యనారాయణ, హైదరాబాద్.

"నిజమే మామ్మా! రాకెట్ మీద అక్కడికి వెళ్ళేరు. అది గూడా మన భూమిలాగే వుంటుంది—అక్కడనుంచి తవ్వి ఈ రాళ్ళు పట్టుకొచ్చేరు. అక్కడ పరిస్థితులన్నీ అనుకూలంగా వుంటే రేపటి నుండీ మనం కూడా రాకెట్ మీద ఝామ్మని వెళ్ళి చక్కా రావచ్చు!"

చంద్రలోక యాత్రను ఊహిస్తూ గట్టిగా దమ్ము లాగేను.

"అయితే బాబూ! అక్కడ కూడా మనలాటి మనుషులున్నారా?"

"అబ్బే! లేరు."

"మరక్కడేటున్నది?" ఆసక్తిగా అడిగింది ముసిల్ది.

రావల్సిన మిత్రుడు యింకా రాలేదు. అందుకే ముసిల్దానితో సంభాషణ పొడిగించేను. "అక్కడ కూడా భూమి మీదలాగే కొండలు, గోతులు రాళ్ళు, రప్పలు ఉన్నాయి. అక్కడ మనుషులు బతకడానికి వీలుందేమోనని చూస్తున్నారు. బంగారులాటి ఖరీదయిన లోహాలు ఏవైనా దొరికితే భూమ్మీదకి తెస్తారు."

"అయితే అటివల్ల మనకి లాభం వుంటాదా?"

"ఎందుకుండదు? ప్రపంచమంతా సిరి సంపదలతో తులతూగి పోతుంది!...." అన్నాను హుషారుగా.

ముసిల్దానికి యీ వాక్యం అర్థమైనట్టు లేదు.

నా వేపు ఆశగా చూస్తూ 'ఏటి బాబూ?" అంది.

"అవన్నీ భూమి మీదకు తెస్తే కావల్సినంత డబ్బు మామ్మా! ఇంక దరిద్రమనేది ఉండనే వుండదు!" చేతిలోని సిగరెట్టు పారేశాను.

ముసిల్దాని ముఖంలో కాస్త ఆశ కనబడింది! తెల్లని కనుపాపల వెనుక రవంత వెలుగు!

నాకు మరి కాస్త దగ్గరగా వచ్చి కర్ర ఆసరా సరి చేసుకుంటూ అడిగింది— "నేనో మాట అడుగుతాను. కోప్పడకు బాబూ! మరి, మాలాటోళ్ళందరికీ కూడూ గుడ్డా దొరుకుద్దా:" ముసిల్ది బోసినోరు తెరుచుకొని, గుడ్లు పెద్దవి చేసి, కుతూహలంగా నా వైపు చూస్తోంది. సమాధానం కోసం;!

ముసిల్దాని ప్రశ్న నన్ను కాస్సేపు తికమక పెట్టింది.

"నిజమే! ప్రపంచం సౌభాగ్యవంతం కావొచ్చు! ఆ సౌభాగ్యంలో యీ ముసిల్దానికి వాటా వుందో, లేదో!" ముసిల్దాన్ని చూస్తే చాలా జాలేసింది.

అది పట్టు పరుపులూ, ఎయిర్ కూలర్లూ, విహారయాత్రలూ, పంచభక్ష్య పరమాన్నాలు కోరటం లేదు!


Grams: "ANILEQUIP" Phone: 5323

## ANIL SCIENTIFIC EQUIPMENTS

BESANT ROAD, GOVERNARPET

VIJAYAWADA-2

IMPORTERS, MANUFACTURERS AND

STANDARD SUPPLIERS OF

ALL LABORATORY & ENGINEERING APPARATUS

TO ALL INSTITUTIONS

*A TRIAL ORDER WILL CONVINCE YOU.*




దానికి కావల్సింది; ప్రకృతి తాకిడి నుండి రక్షించుకోటానికీ, ప్రాణాన్ని సంరక్షించుకోటానికి చాలినంత బట్ట!

ప్రాణం నిలబెట్టుకోటానికి ఏక్కడు గంజి! పట్టెడన్నం!

అవి లభిస్తే ప్రపంచం ఎలా పోయినా ముసిల్దానికి సంబంధం లేదు. దానికి అవి దొరుకుతాయని ఖచ్చితంగా ఎవరైనా చెప్ప గలను?

'ఒకవైపు ప్రగతి పరుగెత్తోంది! శాస్త్రం వృద్ధి అవుతోంది! నిత్యజీవితంలో మనిషి ఎన్నో సుఖాలు ఏర్పాటు చేసు కుంటున్నాడు. మనసులోని ఊహలకు మల్లే అతి వేగంగా ఎగిరి ఎక్కడకు కావలిస్తే అక్కడకు చేరపోగలుగు తున్నాడు.

ఇంకొక వైపు మానవత నశిస్తోంది! పగ, దౌర్జన్యం పెరిగి యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం నశించి తను నిర్మించుకున్న ఆయుధాలతో తన వారినే బలి పెడుతు న్నాడు! కొంతమంది తిండి బట్టకూ ముఖం వాచి దినం గడవటమే కష్టంగా బ్రతుకుతున్నారు.

ఈ రెండిటికీ సమన్వయం ఎక్కడ?

ఏ శాస్త్రం, ఏ ప్రగతి, ఏ కళ దీన్ని సమన్వయపరచగలదు! ప్రతి మనిషికీ, నిత్య జీవితానికి అవసరమైనవన్నీ లభించే పరిస్థితి ఎలా వస్తుంది!'

ఆలోచిస్తున్నాను! ఎక్కడా తలా తోకా అందటం లేదు!

నేను సమాధానం చెప్పలేదని కాబోలు ముసిల్ది కర్ర టకటక లాడించుకుంటూ రోడ్డు అవతలి వైపు మెల్లిగా కదిలి పోతోంది. కదిలి పోతున్న ముసిల్దాని ముఖంలో ఎంతో దైన్యం వుంది.... తెల్లగా పాలిపోయిన దాని గాజుకాయ ల్లాంటి కళ్ళల్లో ఎంతో విషాదం ఉంది!

నీరసంగా నడుస్తున్న దాని అడుగుల్లో ఎంతో నైరాశ్యం ఉంది!

కొంతసేపు, కదిలి పోతున్న ఆమె వంకే తదేకంగా చూసి తరువాత చూపులు మరల్చుకొన్నాను.

దీర్ఘంగా నిట్టూర్చి, జేబులోనుండి మరో సిగరెట్టు తీసి వెలిగించాను.

ఇంతలో—రాకాసి అరుపులాంటి హారను, కీచుమంటూ కారు ఆగిన చప్పుడు, ఆ చప్పుడులో కలిసిపోయి లీలగా వినిపించిన మూలుగు—నా చెవులకు సోకాయి!

వెనక్కు తిరిగాను....

కళ్ళు తిరిగినట్లయింది!

దెయ్యంలాటి కారు చక్రాల ముందు ముసిల్ది బోర్లా పడి ఉంది!

కొంకర్లు పోయిన చేతివేళ్ళు రోడ్డు మీది మట్టిని కౌగలించుకుంటున్నాయి!

దాని తల పగిలి కారిన రక్తం, పీచు లాంటి జుట్టును తడిపి ప్రక్కలకు పరుచు కుంటోంది! తల ప్రక్కనే ఉన్న కంకర రాయి రక్తంలో తడిసిన చంద్రశిలలా మెరుస్తోంది!

ఆ దృశ్యం చూస్తూంటే కడుపులో ఏదో దేవినట్లయ్యింది!

క్షణం సేపు కళ్ళు బైర్లు కమ్మాయి!

మనుషులందరూ కారు చుట్టూ గుమిగూడారు! కార్లోని మనిషి ఇంగ్లీషులో ఏదో సర్ది చెప్తున్నాడు. లోపల వరండా లోని పోలీసులిద్దరూ పరుగెత్తుకుంటూ కారు వద్దకు వచ్చారు!

నాకు మనసంతా దిగులుగా అయి పోయింది!

ఆ ముసిల్ది చచ్చిపోయింది! అవును-చచ్చిపోయినట్లు చలనం లేని ఆమె శరీరమే చెప్తోంది!

ముసిల్ది నిశ్చయంగా చచ్చిపోయింది!

కొన్ని క్షణాల క్రితం అది నన్నడిగిన ప్రశ్న యింకా చెవుల్లోనే సుడులు తిరుగు తోంది!

"————మరి మాలాటోళ్ళందరికీ కూడూ, గుడ్డా దొరుకుద్దా....?"

'ఇక దానికి కూడు అక్కరలేదు!

ఎవరయినా దయ తలిస్తే శవం మీద కప్పటానికి రెండు గజాల గుడ్డ కావాలి! అంతే!!'

భయంకరమైన ఆ దృశ్యాన్ని చూస్తూ అక్కడ నిలబడలేక ముందుకు నడిచాను.

చంద్రశిల ప్రదర్శన ఆవరణలోని 'క్యూ' యింకా ముందుకు కదుల్తూనే వుంది.